కథ

సికిందారాబాద్ ప్యాట్నీసెంటర్ ఫ్లైవోవర్ దగ్గరికి వచ్చేసరికి రెడ్‌లైట్ పడింది. ఏదో మంత్రదండం చూపినట్లు వాహనాలన్నీ ఈ చివర్నుంచి ఆ చివర వరకూ ఆగిపోయాయి. 'దిగవే అరుణా!' 'పదవే విప్లవా!' అనుకుంటూ, జనాన్ని నెట్టుకుంటూ నేనూ, విప్లవ జ్యోతీ ఎలాగో బస్సులోంచి బయటపడ్డాం.అల్వాల్ బస్‌స్టాప్ వైపు పరుగులు దీశాం. అల్వాల్, బాలాజీనగర్‌ల వైపు పోయే కంపెనీ పికప్ వ్యాన్ల కోసం ఆ కార్నర్‌లో కాపు కాస్తూ నిలబడ్డాం. ఏయస్‌రావ్ నగర్, ఇసిఐఎల్ వైపు పోయే వ్యాన్లూ, కార్లూ కూడా అక్కడే ఆగుతుంటాయి. ఆ డ్రైవర్ల చేతిలో అయిదో, పదో పెడితే హాయిగా కార్లో కూచొని యఫ్‌యమ్ రేడియో వింటూ యిళ్లకు పోవచ్చు. అందుకే మాలాగా చాలా మంది ఈ పికప్ వెహికిల్స్ కోసం ఆ టైంలో అక్కడ వెయిట్ చేస్తూ వుంటారు.



# బొమ్మా-బొరుసా?!

## అరిగే రామారావు

ఆ వెయిటింగ్ గేప్‌లోనే కాస్త ఇంత గాలి పీల్చుకునేది, కాస్త మాటా మంతీ, నాలుగు మాటలూ, కాసిని నవ్వులూ...

''మన తాతగారు ఈ రోజు ఇంకా దిగలేదేం అరుణా?'' అంది విప్లవజ్యోతి.

''తాతంటే తంతాడే తల్లీ! తాత అనమాకే!''

ఒక పెద్దాయన ప్రతిరోజూ మాతో పాటే మేం ఎక్కే కేబ్‌లో ఎక్కుతుంటాడు. ఆయన అల్వాల్ సత్యా పెట్రోల్ బంక్ దగ్గర దిగిపోతాడు. మేం ఇంకా పైకి బాలాజీ నగర్ వైపు పోతాం.

ఒక సారి నోరు జారి మా విప్లవ ఈ పెద్దాయన్తో, 'ఈ రోజు మన అల్వాల్ కేబ్‌లు వచ్చేటట్లు లేవు తాతగారూ!'' అంది.

ఆ మాటకు ఆయన సీరియస్సుగా మొహం పెట్టి, ''ఇక్కడ నో తాతలు, వోన్లీ అంకుల్స్!'' అని కట్‌గా అన్నారు. ముందయితే మేం బిత్తరబోయి, ఆనక చాటుగా నవ్వుకున్నాం.

మనిషి చాలా టిపికట్‌గా వుంటాడు. డై చేసిన గిరజాల జుట్టూ. వత్తుగా పెంచిన సైడ్ బరన్స్. ఎప్పుడూ యాక్షన్ షూ వేస్తారు. ఫుల్ టక్‌లో టెక్‌గా వుంటాడు. త్రాడు కట్టిన సెల్‌ఫోన్ మెళ్లో వ్రేలాడేసుకుంటాడు. త్రాళ్లు కట్టిన కళ్లద్దాలు పెట్టుకుంటాడు. కాలేజీ కుర్రాళ్ల టైప్‌లో ఆఫీసు బ్యాగ్‌ను క్రాస్‌గా సైడ్‌కు వ్రేలాడేసుకుంటాడు.

రోజూ దాదాపు ఇదే టైంకు బషీర్‌బాగ్ వైపు నుంచి ఆటోలో వస్తారు. ఈ వయస్సులో కూడా ఏదో ఆఫీసులో పనిచేస్తూండాలి.

ఆటోచార్జీలు ఇవ్వటానికి పాపం ఆ ఆటోవాడ్ని ముప్పతిప్పలు పెడుతూవుంటాడు. పెరిగిన ఆటో చార్జీల చార్టునూ, మీటర్నూ మార్చి మార్చి చూచి చూచీ, గీచి గీచి మరి ఇస్తారు. చిల్లర పైసల దగ్గర పేచీ.

ఈ ముస్సలోడ్ని ఎందుకు ఎక్కించుకున్నామా అని ఆటో వాళ్లు నెత్తికొట్టుకుంటారు.

అల్వాల్ సైడ్ పికప్ వ్యాన్ రావటం ఆలస్యం మమ్మల్ని తోసుకుంటూ లోపలికి ఎక్కి బైఠాయిస్తాడు. ఆయనకి ఎప్పుడూ విండోసైడే కావాలి.

ఎక్కే జనం ఎక్కువ వున్నప్పుడు ఆడా మగా అంటూ లేదు. ఒకరి మీద ఒకరు కూచోవాలి. కేబ్ కావాలంటే అంతేమరి. దాదాపు ఈ పెద్దాయన్ని ఆనుకుంటూ నేనో, విప్లవో కూచుంటాం. మేం ఏ అంటరాని వాళ్లమో అన్నట్లు ప్రక్క ప్రక్కకి జరుగుతూ వుంటాడు. మా నుంచి దుర్గంధమేదో వస్తూన్నట్లు కర్చీఫ్‌తో మాటి మాటికి ముక్కు మూసుకుంటూ వుంటాడు.

కేబ్ బయలుదేరటం ఆలశ్యం సెల్‌ఫోన్ తీస్తాడు. ఆయన భార్యతో కాబోలు మాట్లాడుతూ వుంటాడు. ఆ టాకింగ్‌కు నో ఎన్డింగ్.

''...ఎక్కడ అఘోరిస్తోన్నావ్? సెల్ ఎంత సేపట్నుంచి మ్రోగుతూందీ? వినిపించటం లేదా? చెవుడురోగం గానీ వచ్చిందా? ఆ దండగమారి టీవీకీగానీ అతుక్కు పోయావా?... రోజూ నువ్వు చూచే ఆ దరిద్రపు గొట్టు సీరియల్స్ ఈ వేళప్పుడు రావుగా? మరెక్కడ చచ్చావ్?... ఓకే పైన ఆరేసిన బట్టలు తీయటానికి పైకి వెళ్లవా?... ఈ మాట ముందే చెప్పి ఏడ్వొచ్చుగా? ఇంతకీ నా బన్నీనూ, లుంగీ కూడా తీశావా లేదా? పోయిన సారి పైన వదిలేశావు! నా లుంగీ గాలికెగిరిపోయి ప్రక్క కొంపలో పడ్డది. ఆ పక్కింటి గజ్జి వెధవ చీకట్లో నా లుంగీని వాడిలుంగీ అనుకుని కట్టుకు చచ్చాడు. ఆడి గజ్జి నాకంటుకుంది. వారం రోజులు దాకా గోక్కోలేక చచ్చా!... ఆc ఆc.. అట్టా గానీ చేయలేదు గదా? అన్నీ తెచ్చావా?...''

ఆయన మాటలకు మేం ముసి ముసిగా నవ్వుకుంటాం. ఆయన మాకొక టాకింగ్ టాపిక్; లాఫింగ్ స్టాక్! ఆఫీసుల్లో పగలస్తమానం బడలి, ఈ బస్సుల్లో వడిలి, సాయింకాలం యిళ్ల దారి బట్టే మాకు ఈయనొక కాలక్షేపం!

ఒకోసారి ముందుగా ఆవిడే ఫోన్ చేస్తుంటుంది.


''ఆc నేనే! చెప్పి ఏడువ్!... ఇప్పుడెక్కడ వున్నానంటావా? ఆc- ఐమేక్స్‌లో బజ్జీలు తింటూ 'బుజ్జిగాడు' సిన్మా చూస్తోన్నా!... మరెందుకే, ఎక్కడున్నారు, ఏం చేస్తున్నారు అంటూ చచ్చు ప్రశ్నలు వేస్తావ్ చచ్చుముండా!... ఇదిగో ఈ కార్లో ఈ కంపులో, ఈ నానా ఛండాలంలో వున్నా!... ఒరేయ్ డ్రైవరు కుర్రోడా.! ఏంట్రా నీవ్వు తింటూంది?..''

''గుట్కా తింటున్నా సార్! నీక్కూడా కావాలా?''

''ఓరి దౌర్భాగ్యుడా ఆ ఛండాలం నన్నూ తినమంటావా? గుట్కాలు తింటూ మీవూళ్లో జట్కాలు తోలుకోక ఎందుకురా ఈ సిటీలో ఈ కేబ్‌లు నడిపిస్తూ మా ప్రాణాలు తీస్తారు?''

''మా వూళ్లో జట్కా ల్లేవ్ సార్!''

''అయితే అఘోరించు!... ఆc నీవు చెప్పు, ఇంతకీ ఫోనెం దుకు చేశావో! ఏంటీ కారుమబ్బులు కమ్ము కొస్తున్నాయా? వర్షం రాకముందే నన్ను తొరగా




యింటికి జేరు కోమంటావా? అబ్బే, రానే! ...ఏ పిల్లనో వెంటేసుకొని వాన్లో తడుస్తూ, 'చిట పట చినుకులు పడ్తొ వుంటే...'' అంటూ సిన్మాపాట పాడుతూ వుండిపోతా సరా!... వెధవ ప్రేమలు వొలక బోస్తోంది... అబ్బో, నీభయం నీదా? దేనికమ్మా అంత భయం?... పోయిన సారి నేను వాన్లో తడిచి ముద్దయి యింటికి వస్తే- నువ్వు నా తల తుడిచీ, పొడి బట్టలు కట్ట బెట్టీ, నా ఛాతీకి విక్స్ రాసీ, నాకు కాపటంపెట్టీ నాకు సేవలు చేయలేక నానా చావు చచ్చావా? అబ్బ, ఎంత పతి భక్తే నీకు? అప్పుడలా చేయటం దేనికీ, ఇప్పుడిలా దెప్పటం దేనికీ? వాగింది చాలు... ఇక పెట్టేయ్!''

అయినదానికీ కాని దానికీ పాపం, ఆవిడ్ని ఇలా రాపా(ఫా)డిస్తుంటాడీ మహానుభావుడు.

ఈయన మాటలకు నాకయితే నవ్వు వస్తుం టుందిగానీ, మా విప్లవకయితే ఒళ్లు మండి పోతుంది. ఈ మొగ జాతిని అందునా ఇలాటి ముసలి పీనుగుల్ని నడి రోడ్డు మీద లైటు స్తంభానికి తాడేసి ఉరి దీసి వ్రేలాడదీయాలి అంటుంది.

వాళ్లది విజయవాడ సైడ్. వాళ్ల నాన్న మార్కిస్టు. అందుకే దీనికి 'విప్లవజ్యోతి' అని పేరు పెట్టారు. పేరుకు తగ్గట్టు దీనికన్నీ విప్లవ భావాలు.

...ఆ రోజు శనివారం. వీకెండ్. పాపం, ఈయనగారి అర్ధాంగికి సిన్మాకెళ్లానిపించిందేమో. సెల్‌కి ఫోన్జేసి సిన్మా టికెట్స్ తీసుకురమ్మని చెప్పి వుంటుంది. దానికీయన, ''ఏంటీ, లక్ష్మీకళామందిర్‌లో దశావతారం సిన్మాకు టిక్కెట్లు తీసుకురమ్మంటావా? ఒశేయ్, నీవ్వే ఒక శని అవతారం! మళ్లీ నీ మొఖానికి దశావతారం సిన్మాకూ డానా? శ్రీ మహా విష్ణువు శేషతల్పం మీద పవ్వళించిన బొమ్మను చూచి ఇదేదో భక్తి సిన్మా అనుకుంటున్నావా? జేమ్స్ బాండ్ సిన్మా అంట! మా ఆఫీసులో జనాలు చెప్పుకుంటు న్నారు. కాబట్టి ఇంట్లో పడి ఏడ్వు! కాకరకాయలు తీసుకొస్తోన్నా ఎంచక్కా వేపుడు చెయ్యి!''

''చూశావా, ఇలా రుచులు మరిగి ఆడవాళ్ల అభిరుచులేంటో పట్టించుకోకుండా, వాళ్ల చేత నానా చాకిరి చేయించుకుంటూ, కాలి కింద పడివున్నదే చెప్పులాగా, నేల కేసి తొక్కేస్తోన్నారు. కాలికేసుకునే చెప్పు కూడా తన తడాఖా చూపిస్తుంది. కొత్తగా వున్నప్పుడు కాలిని బిగుతుగా పట్టేసి కరిచి పుండు చేస్తుంది. పాతబడ్డాక ఆ చెప్పే చెప్పాపెట్టకుండా దారి మధ్యలో తెగి నానా తిప్పలు పెడుతుంది...'' మా విప్లవ ఆవేశంగా పైకే అంటుంది.

''ఏంటమ్మా, ఏంటా గుసగుసలు? నా గురించేనా?''

''అబ్బే వేరు తాతగారు, మీరీ వయస్సులో కూడా ఉజ్జోగం చేస్తోన్నారేంటా అని...'' నేను సర్దిచెప్పాలని చూశాను.

''అదిగో మళ్లీ '**తాతగారు**'! మేం అల్లాటప్పా పప్పాలం కానోం! నో ఏజ్ బార్ మాకు, ఉజ్జోగాలు చేస్తాం, వూళ్లు ఏలుతాం; రాజకీయాలు చేస్తాం, రంగులు మారుస్తాం! మైండ్ యువర్ వోన్ బిజినెస్...''

చింత చచ్చినా పులుపు చావని వృద్ధ పురుషాంహాకారం!

...రాను రాను ఈయన ధోరణి మహా దారుణంగా వుంటోంది. ఆ నోటికి సుద్దీ పద్దీ, హద్దూ ఆపూ లేకుండా పోతూంది.

ఒకరోజు–

''ఆc... వింటున్నా! వినక చస్తానా? ఏంటో చెప్పి ఏడ్వు! ఏంటీ, వూర్నుంచి మీ అన్నయ్య వచ్చాడా? వస్తాడే వస్తాడు. కోర్టు పక్షి కదా! హైకోర్టు వాయిదాలంటూ నెలనెలా ఇలా వాలుతుంటాడు! ఫైగా పొట్టపగల తినిపోతుంటారు! ఇంతకీ ఏం కావాలో చెప్పి తగలడు! లోతుగుంటలో దిగి కిలో చికెన్ తెమ్మంటావా? ఆc... ఆ చేత్తోనే పుల్లారెడ్డి స్వీట్స్ తెమ్మంటావా? ఏంటీ, ఆ చేత్తోనే ఫ్రూట్స్, తమల పాకులూ క్రెన్ వక్కపొడీ తెమ్మంటావా? అన్నగారికి మర్యాదలు చేయాలిగా!... తెస్తా తెస్తా... ఆ చేత్తోనే ఇంత పురుగుల మందు కూడా తెస్తా! ఆ చికెన్ కర్రీలో కలుపుతా! అది తిని తెల్లారేపాటికి చచ్చి పడివుంటాడు!... పీడవిరగడైపోతుంది... ఏంట్రా మధ్యలో నీ గొడవ!''

''ఆపండి సార్! మీరు ఎక్కిన సంది వూరికే లొడలొడా వర్లుతుంటారు. నేను మేడంతో అవతల మాటాడుతున్నా! వినిపించాచవంలే! పంజాగుట్ట కాడ ట్రాఫిక్ జామ్ అయింది. అందుకే ఈ లేటు! నో మేడమ్! మద్దెలో ప్యాసింజేర్లను ఎక్కించుకోలేదు మేడమ్ ఖాళీగా వస్తొన్నా.''

''ఓరి అబద్దాల కోరా! జనాన్ని కుక్కి కుక్కి ఎక్కించుకొని ఫైగా ఎవ్వరూ లేరంటావా?''

''అబ్బ, నీవ్వుండవయ్యా! యస్ మేడమ్. ఇప్పుడు లోతుగుంటలో వుణ్ణ! ఐదునిమిషాల్లో మీకు రిపోర్టు చేస్తా మేడమ్!''

''అరేయ్ ఇప్పుడు మనం విక్రమపురిలో వుంటే లోతుగుంటలో వున్నామని చెప్పుతున్నావా? మరీ ఇంత బొంకా?''

''అట్నే చెప్పాలి! మీకు తెలియదు!''

...ఆ తర్వాత ఒక విచిత్రం జరిగింది.

వారం పదిరోజులు ఈ పెద్దాయన జాడే లేదు. విప్లవకు ఎంతో రిలీఫ్‌గా వుంది. నాకయితే ఏదోగా వెలితిగా వుంది. సందడిలేదు. కేబ్ డ్రైవరు కూడా ''ముస్సలోడు రావటంలేదే మేడమ్?'' అన్నాడు.

''కొంపదీసి పురుగులు మందు కలిపిన ఆ చికెన్‌కర్రీ తిని ఈయన చచ్చాడేమో! ఆ మహా ఇల్లాలు బతికిపోతుంది!'' విప్లవ కసిగా అంది.

''పోన్లేవే పాపం, పెద్దాయన! వయస్సుతో పాటు వచ్చిన చాదస్తం!''

''చాదస్తమా! చట్టుబండలా! దురహంకారం! మగాడ్ని అన్న గర్వం! నాకెవ్వరైన ఏ.కే.47 ఇస్తే ముందు కాల్చేది ఈ ముస్సలోడ్నే!'' ఎందుకే అంత కోపం?''

''కోపంగాక ఏంటే? ఈయన్ని చూస్తోంటే, ఆ మాటలు వింటూంటే పెళ్లంటేనే రోత కలుగుతుంది. పెళ్లీ పెటాకులేకుండా ఇలా పడివుంటేనే మంచిదనిపిస్తోంది''

...ఒక రోజు అనుకోకుండా ఆయన పూడిపడ్డాడు. మనిషి కాస్త నలిగివున్నాడు. ''రోగం వచ్చిందేమో!'' విప్లవ గొణిగింది.!! ''ఏంది సార్, కనిపించటంలేదు. రూటుగానీ మార్చారా?'' కేబ్‌డ్రైవరు అన్నాడు...

మా వ్యాన్ సికిందరాబాదు క్లబ్ దాటుతోంది. ఇంతలో ఆయన సెల్ మ్రోగింది. బయటికి తొంగి చూస్తూన్నాడేమో జేబు లోంచి సెల్ తీయటం కాస్త ఆలస్యం అయింది.

''ఆc చెప్పు!... సెల్ తీయటం లేటయిందేంటీ, నాకు చెవిటిరోగం ఎదైనా వచ్చిందా అంటున్నావా? అలాంటిదేం లేదు! కార్లోంచి బయటికి చూస్తోన్నా!... రోడ్డు మీద పోయే ఆడవాళ్లను సొల్లుకార్చుకుంటూ చూస్తోన్నానంటావా? తప్పు నేనలాటివాడ్ని కాను!...''

మేమిద్దరం బిత్తరపోయాం– ఇంత సౌమ్యంగా, చచ్చు దద్దమ్మలాగా మాటాడుతున్నాడేంటీయనా అని.

''...ఇంతకీ నీవ్వు ఫోనెందుకు జేసింది చెప్పనేలేదు... ఏంటీ వూర్నుంచి మీ చెల్లెలు వచ్చిందా? సరే, నన్నేం తీసుకురమ్మంటావ్?... ఏంటీ, పారడైజ్‌లో స్పెషల్ చికెన్ బిర్యానీ ఫ్యామ్లీపేక్ తీసుకు రమ్మంటావా? వ్యాన్‌లో వస్తోన్నా. వ్యాన్ లాల్‌బజార్ దాటిపోయింది... మళ్లీ వెనక్కి పొమ్మంటావా?...''

''ఏంటన్నార్ మనం వున్నది విక్రమపురిలో అయితే లాల్‌బజార్ అంటారేంటీ?'' క్యాబ్‌డ్రైవరు ఆశ్చర్యంగా అన్నాడు. ''మాకు తెల్సులేవోయ్! అవసరాన్ని బట్టి బొంకాలిరా కుర్రకుంకా!''

సెల్‌లో, ''...నో నో అలాంటిదేం లేదు! తీసుకు రావడం నాకిష్టం లేక కాదు, ఈ డ్రైవరు కుంక ఏదో అంటుంటేనూ... లోతుగుంటలో దిగి కిలోచికెన్ తీసుకువస్తా సరా! ఏంటేంటీ, ఇంట్లో వండేది మీ చెల్లెలు యిష్టపడదా? పారడైజ్ బిర్యానీయే కావాలంటుందా? రాహుల్‌గాంధీ కూడా అక్కడే తిన్నాడా? అవును కదా! నోరు మూసుకొని తీసుకు రమ్మంటావా? ...చెప్పింది చేయమంటావా? ...ఒకే ఒకే... అలాగే, సత్యా దగ్గర దిగి, ఐటిబి ఏటియంలో డబ్బు డ్రా చేసి, మళ్లీ ఆటో తీసుకొని పారడైజ్ పోతాను చచ్చినట్లు. తప్పేదేముంది?...''

నేనూ, మా విప్లవ ఆశ్చర్యంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నాం; ఇది కల్లా నిజమా అని ఒకర్నొకరం గిల్లుకున్నాం...

''..అబ్బే, నీవ్వు చెప్పాకా నాకేం కష్టం! ఒకే.. అలాగే!.. ఏంటీ, ఆచేత్తోనే ఫ్లవర్సూ, ఫ్రూట్స్... తెమ్మంటావా!.. ఆ చేత్తోనో పుల్లారెడ్డి స్వీట్స్ తెమ్మంటావా!., ఆ చేత్తోనే స్పెషల్ కిళ్లీలు కట్టించుకురమ్మంటావా?.. ఒకే ఒకే! ఏంటీ.. ఆ చేత్తోనే ఒక కోడిని కూడా కొనుక్కు రమ్మంటావా! పీక కోసిందా? దేనికి?... పారడైజ్ చికెన్ బిర్యానీ ఎటూ తెస్తున్నాగా, మళ్లీ ఇది దేనికి? ఏంటీ, మీరిద్దరూ బిర్యానీ తింటుంటే, నేను కోడి బొచ్చుపీక్కుంటూ గుటకలు మ్రింగుకుంటూ, మిమ్మల్ని చూస్తూ కూర్చోవాలా? మీ చెల్లెలికి ఇది సర్దానా? అదో ఎన్జాయ్‌మెంటా?...''

క్యాబ్‌డ్రైవర్ నోట్లోవున్న గుట్కా వుమ్మును తుపుక్కున వూసి, ఫక్కున నవ్వేడు.

మా విప్లవ సంగతి చెప్పనే అక్కర్లేదు! నవ్వు ఆపుకోలేక వుక్కిరిబిక్కిరి అవుతోంది... దాని ఆనందానికి పట్టపగ్గాల్లేవు...

సెల్‌ఫోన్ టాక్ ఇంకా కంటిన్యూ అవుతూనేవుంది...

''ఐమేక్స్‌లో సండేకు దశావతారంకు అడ్వాన్సుగా టెలిబుకింగ్ చేయించమంటావా? అది భక్తి సిన్మా కాదుకదే!... జేమ్స్‌బాండ్ సిన్మాలంటేనే నీకిష్టమా? అదే చూస్తావా? ఒకే...అలాగే చేయిస్తా! ...అవును, రెండు టిక్కట్లు అంటావేంటీ? నీ చెల్లెలుతో కలిపి మనం వున్నది ముగ్గురం కదా, రెండు ఎట్లా సరిపోతాయి? ... ఏంటీ, నేనే ఒక పెద్ద శనిఅవతారమా? మీ యిద్దరి మధ్య మొద్దావతారం నేనెందుకు అంటావా?...''

మా విప్లవ ఆనందంతో ఆకాశంలో ఎగిరే విహంగమే అయింది!

''నిజంగా నాకు చాల ఆనందంగా వుందే అరుణా! ఈ ఆనందం నా ఒక్కదాని ఆనందం కాదు. సమస్త స్త్రీజాతి ఆనందం! సంవత్సరాల తరబడి ఒక పురుషాహంకారి చేత అణగదొక్కబడి కట్టుబానిసగా బానిసబతుకులు బతికిన ఒక బామ్మగారు ఇన్నేళ్లకు మొగుడి మీద తిరగబడి, ధైర్యంగా ఎదిరించి నిలబడి బుద్ధిచెప్పిన రోజు ఇది! మనమంతా గర్వించవలసిన రోజు! ఈహేపీ అకేషన్ని మనం సెలబ్రేట్ చేసుకోవాలి! రేపు నీవు లంచ్ బాక్స్ తెచ్చుకోవద్దు. నా డబ్బుల్తో నీకు చికెన్ బిర్యానీ తినిపిస్తా!'' ఆయన వినేటట్లు, వినాలన్నట్లు గట్టిగా అంది గలగలా నవ్వుతూ. ఆయన విననట్లే బయటికి ఏటో చూస్తోన్నట్లు కూర్చున్నాడు. లోపలలోపల కుతకుతలాడిపోతున్నాడు.

ఇంతలో సత్యాపెట్రోల్‌బంక్ వచ్చింది.

ఆయన కార్లోంచి దిగుతూ మాతో సీరియస్సుగా, ''మీరు మరీ ఇంతగా విరగబడిపోనక్కర్లేదు! మా ఏబ్రాసి మొహానికి ఇంత ధైర్యం కూడానా? ఇది మా సెకండ్‌సెటప్'' అని అన్నాడు.

*

